తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ముగిసిన "లక్ష కుంకుమార్చన"

చంద్రగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆల యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన లక్ష కుంకు మార్చన మంగళవారం ముగిసింది. ఆలయ ఈఓ మమత ఆదివారం ఆలయ అర్చకులు సూరి స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు లక్ష కుంకుమార్చనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మూడవ రోజున పెద్ద ఎత్తున భక్తులు లక్ష కుంకుమార్చన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూరి స్వామి మాట్లాడుతూ వివాహం, సంతానం కొరకు, సర్వగ్రహ దోష నివారణకు, ఆరోగ్యం, విద్య వంటి కోర్కెలను తీర్చుకునేందుకు లక్ష కుంకుమార్చన దోహదపడగలదన్నారు.

## నిమ్మకాయల అలంకారంలో గంగమ్మతల్లి

తిరుపతి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మతల్లికి జరగనున్న వారంరోజుల జాతర మహోత్సవంకు ముందు తొలి మంగళవారం గంగమ్మను నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం ఉదయం గంగమ్మకు విశేష అభిషేకాలు నిర్వహించిన అర్చకులు ఆ తరువాత అమ్మవారిని పూర్తిగా పవిత్రమైన నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. దాతలు లావణ్యరెడ్డి, రుద్రకోటి, శైలజ వ్యవహరించారని, నిమ్మకాయల అలంకరణకు విరాళమిచ్చారిన గంగమ్మ ఆలయ ఈఓ ఎ.జయకుమార్ తెలిపారు. గంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయంలో పూర్తి ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు. మహిళ భక్తులు పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

## తిరుపతిలో రతన్ టాటా
# ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానం

### స్పోక్స్ మోడల్ తాత్కాలిక భవనం కోసం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలన



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :

తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా ఏర్పాటు కానున్న స్పోక్ మోడల్ తాత్కాలిక భవనం కోసం గుర్తింపు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా రాష్ట్రంలో ఐదు స్పోక్ మోడల్ తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మన తిరుపతిలో ఏర్పాటు చేయనున్న స్పోక్ భవనం కోసం నేడు ఐఐటీ, ఏపీఐఐసీ పలు భవనాలను ఐటీఈసీఓఎస్‌డీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా దీప్తి, ఐఐటీ ఏర్పేడు డైరెక్టర్ సత్యనారాయణ, అమరాజా ఆదోని కంపెనీ ప్రతినిధులు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్‌రెడ్డి సంబంధిత అధికారులతో పరిశీలించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు మన రాష్ట్రంలో రాష్ట్ర సీఎం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారని, ఇందులో భాగంగా రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా సింగల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ హబ్‌ల ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్టీఆర్ జిల్లా, తిరుపతి జిల్లా, అనంతపురం జిల్లా ప్రత్యేక హబ్ స్పోక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. దక్షిణ ఆంధ్ర కవర్ చేసేలా ఐఐటీ తిరుపతి స్పోక్ హబ్‌గా నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి ఉండనున్నదని, అందులో భాగంగానే మంగళవారం తిరుపతి జిల్లాలో ఏర్పాటు చేయనున్న స్పోక్స్ మోడల్ కోసం తాత్కాలిక భవనం కోసం పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్కిటెక్చర్ మణి, సందీప్, సిఓఓ అదాని కృష్ణపట్నం, పోర్టు లిమిటెడ్ రాజన్ బాబు, నవయుగ సీఈవో సుబ్బారావు, పీడీలు డీఆర్డీఏ, మెప్మా శోభన్ బాబు, రవీంద్ర, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుధాకర్‌రావు, ఏర్పేడు తహశీల్దార్ భార్గవి, డెప్యూటీ తహశీల్దార్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు కొత్తగా హోమియోపతి కళాశాల

చిత్తూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

ఆయుష్ వైద్య విధానాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఎ ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు కొత్త ప్రైవేటు హోమియోపతి కళాశాల మంజూరు అయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు నాలుగు హోమియోపతి కళాశాలలు మాత్రమే వుండగా ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఐదవ హోమియోపతి కళాశాల ఏర్పాటు కానుంది. పూతలపట్టు మండలం ముత్తిరేవుల గ్రామంలో శ్రీనివాస ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా హోమియోపతి కళాశాల ఏర్పాటుకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. వెకంటేశ్వర హోమియోపతి మెడికల్ కళాశాల, హాస్పిటల్ పేరుతో ఈ కొత్త కళాశాలలో ప్రతి ఏడాది వంద మంది విద్యార్థులకు ప్రవేశం వుంటుంది. హోమియోపతి కళాశాల ఏర్పాటు చేయడానికి అవసరమైన మౌళిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల లభ్యతను పరిశీలించిన అనంతరం ఆరోగ్యశాఖ మంత్రి ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏడు హోమియోపతి కళాశాలలు వున్నాయి. ఐదున్నర సంవత్సరాల బిహెచ్ఎంస్ కోర్సుల్లో ఏడాదికి 500 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు జాయిన్ అవుతున్నారు. వాటిలో గుడివాడ, రాజమండ్రి, కడపలోని 3 ప్రభుత్వ హోమియోపతి కళాశాలల్లో ఏడాదికి 120 మంది విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారు. అలాగే ప్రస్తుతం గుంతకల్లు, తిరుపతి, తాడేపల్లిగూడెం, విజయనగరంలో వున్న నాలుగు ప్రైవేటు హోమియోపతి మెడికల్ కళాశాలలు యూజీ ప్రోగ్రాంలో ఏడాదికి 400 మంది విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ప్రస్తుతం వున్న ప్రతి హోమియోపతి కళాశాలలో రోజు సుమారు 250 మంది రోగులు అవుట్ పేషంట్ సేవలను, 15 మంది రోగులు ఇన్‌పేషెంట్ సేవలు పొందుతున్నారు.

## సిఎం సొంత జిల్లాలో జనాదరణ కోల్పోతున్న ఎమ్మెల్యేల గ్రాఫ్!

### పదినెలల్లోనే ఆ కొందరి తీరుతో జనంలోనూ వ్యతిరేకత!?



ప్రభాతవార్త-తిరుపతి:

రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేల జనాదరణ గ్రాఫ్ ఆశాజనకంగా లేదనేది పార్టీ వర్గాల్లో చర్చమొదలైంది. వారివారి నియోజకవర్గాల్లో అనుకున్న స్థాయిలో పనితీరు లేదనేది పార్టీ అధిష్టానానికి అందిన నివేదికలు. 13మంది అధికారపార్టీల ఎమ్మెల్యేల్లో ఏడుగురు వరకు ఎమ్మెల్యేల వ్యవహారం వారివారి సొంత పనులు చక్కబెట్టుకోవడం, రకరకాల వ్యాపారాలు చేసుకోవడంలో బిజీఅయ్యారనేది సమాచారం. పార్టీ నేతలకుగానీ, కార్యకర్తలకు కూడా అందుబాటులో లేరనేది నియోజకవర్గాల్లో ప్రజల నుండి వ్యక్తమవుతున్న విమర్శలు. ప్రజలనుండి ఎమ్మెల్యేల పనితీరుపై సదభిప్రాయం లేదనే వ్యాఖ్యలు ఉన్నాయి. పదినెలలపాలనకే వారి పరిస్థితి ఇలా దారుణంగా తయారైందని, రానున్న నాలుగేళ్ళు నియోజకవర్గాల్లో ఏమేరకు ప్రజలకు అందుబాటులో ఉండి మళ్ళీ ఎన్నికల్లో ఓటు అడుగుతారనేది అనుమానమే. ఏడుగురు ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతలేగాక కార్యకర్తలు చివరకు నియోజకవర్గ ప్రజల్లో కూడా ఆ స్థాయిలో వ్యతిరేకత మొదలైందంటే కారణాలను సిఎం చంద్రబాబు సర్వేలతో నివేదిక రాబట్టారు. చాలావరకు జిల్లాలో తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన వారే ఎక్కువగా ఉన్నారు. పాలనపై పట్టు, నియోజకవర్గాల్లో జనాదరణ కలిగిఉండాల్సింది పోయి ఎమ్మెల్యేలు ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో జోక్యం చేసుకోవడం, ఖాళీస్థలాలు పై అనుచరులతో పాగా వేయించడం, ఇసుక మద్యం వ్యాపారాలపై దృష్టి ఉంచారనేది ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే సమయంలో పాలనపై పూర్తిస్థాయిలో పట్టుసాధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్ళడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించడం వంటివాటిపై దృష్టి పెట్టారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై ఇప్పటికే నివేదికల రూపంలో అందిన సమాచారాన్ని సిఎం ప్రాతిపదికగా తీసుకుని జనంలోనే వుండాలని, జనం సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి బుధవారం ప్రజాదర్బార్ పేరుతో వినతులు స్వీకరించాలని స్పష్టంగా ఆదేశించారు. జనంలోనే ఉండాలని కూడా నిర్ధేశం చేశారు. అయినా సొంత జిల్లాలోనే ఎక్కువమంది ఎమ్మెల్యేల పనితీరుపై, జనాదరణ లేకపోవడంపై ఆయన ఆగ్రహం వెలిబుచ్చిన సందర్భాలు ఉన్నాయని పార్టీలో సీనియర్ నేతలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. పనితీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో సీట్లు కష్టమని కూడా బాబు హెచ్చరించారు.

ఇప్పటికీ చాలావరకు ఎమ్మెల్యేలు చుట్టపు చూపుగా నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటునాన్నరనేది కూడా సిఎంకు అందింన సర్వే రిపోర్ట్‌లో విస్తుబోయే అంశాలు. మరీ ఇదే నేపథ్యంలో మేనెలలో జరగనున్న పార్టీ మహానాడులో ఎమ్మెల్యేల జాతకాలు ఆధారంగా సీనియర్ నేతలకు, పార్టీని నమ్ముకుని కష్టపడుతున్న కార్యకర్తలకు పదవులు ఇచ్చేందుకు అధినేత బాబు సుముఖతగా ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీలో ర్కఇయాశీలక పదవులు కూడా పదవీకాలం ముగిసింది. మహానాడులోనే మళ్ళీ క్రియాశీలక ఎన్నికలు జరిపి పదవులు కేటాయింపు ఉంటుంది. ఎమ్మెల్యేల పనితీరు బాగో లేకుంటే ఆయా చోట్ల మాజీఎమ్మెల్యేలకు, సీనియర్ నాయకులకు పెత్తనం ఇచ్చేందుకు కూడా పార్టీ సిద్దమైందనేది విశ్లేషకుల అభిప్రాయం.

## టిటిడిపై అసత్యఆరోపణలు చేస్తే కఠిన చర్యలు

### -భూమనపై కేసు నమోదుకు టిటిడి ఫిర్యాదు



తిరుపతి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

ధార్మికసంస్థ టిటిడిపై ,బోర్డుపై ఎటువంటి ఆధారాలు లేకుండా అసత్యప్రచారాలు చేసినా, మాట్లాడినా ఏ స్థాయి వ్యక్తిపై అయినా కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి వెల్లడించారు. ఆ దిశగా టిటిడి బోర్డులో నిర్ణయం తీసుకుంటామన్నారు. మాజీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డిమాత్రమే లోకల్ కాదని, నేను కూడా లోకల్ నాయకుడని భాను తెలిపారు. తనదగ్గర టిటిడి గురించి ఆయన కంటే ఎక్కువ సమాచారమే ఉందన్నారు. గతంలో భూమన హయాంలో టిటిడిలో జరిగిన అక్రమాలపై విచారణ సాగుతోందని భాను వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో, పాలకమండలిలో చేసిన అక్రమాలు అన్నింటినీ వెలికితీస్తున్నామని, త్వరలోనే అన్నిటిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎంతో పవిత్రమైన గోశాలను గోవధశాలగా మార్చారంటూ కరుణాకర్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజును కలసి భానుప్రకాశ్‌రెడ్డి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

## కోదండరామునికి వైభవంగా పుష్పపల్లకి సేవ

తవణంపల్లె, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పుష్పపల్లకి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానంలో ఈనెల 6 నుండి జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారికి పుష్పపల్లకి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరగొండ. పైమాఘం, రెడ్డిపల్లె మిట్ట గ్రామాలకు చెందిన రెడ్డి కులస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో అర్చకులు ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో అర్చకస్వాములు ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అలంకరించి ప్రత్యేకపూజలు చేసి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే రాత్రి అలంకరించిన శ్రీసీతా సమేత శ్రీరామచంద్రస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం దేదీప్యమానంగా భారీ ఎత్తున ఏర్పాటు చేసిన పుష్పపల్లకిపై వుంచి ప్రత్యేక బాణాసంచా, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు నారి కేళ కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, అర్చకులు, ఉత్సవ ఉభయదారులు, అరగొండ పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.



## అగ్రీగోల్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు ...

### పట్టించుకోని రెవెన్యూ మైనింగ్ అధికారులు

నాయుడుపేట ఏప్రిల్ 15 ప్రభాతవార్త ; అగ్రీగోల్డ్ భూముల్లో కొంతమంది అక్రమార్కులు తమస్వార్థ ప్రయోజనాలకోసం రాత్రిసమయంలో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న సంబందిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దొరవారిసత్రం మండలంలోని అక్కరపాక సమీపంలో ఉన్న అగ్రీగోల్డ్ భూముల్లో కొంతమంది అక్రమార్కులు రాత్రిసమయంలో జెసిబిలతో తవ్వకాలు చేపడుతున్నారు. అక్కరపాక సమీపంలోని జాతీయరహదారి పక్కనే ఉన్న ఓ లేఅవుట్ చదును చేసేందుకు యంత్రాలతో తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వార మట్టిని అక్రమంగా తరళిస్తున్నారు. అదే విధంగా పూలతోటమిట్ట లో సిజెఎఫ్ భూముల నుండి కొందరు అక్రమంగా భారీయంత్రాలతో తవ్వకాలు చేపట్టి అక్రమంగా గ్రావెల్‌ను తరళిస్తున్నారు. ఈవిదంగా భారీయంత్రాలతో గ్రావెల్ తరళించడం వల్లన పూలతోట-దొరవారిసత్రం రోడ్డు గుంటలుపడి అధ్వానంగా మారుతుందని వాహన దారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త గూడూరు మైనింగ్ ఎడిని వివరణ కోరగా ఆయన మాట్లడుతూ దొరవారిసత్రం మండలంలో ఎవరికి మైనింగ్ పర్మిషన్ ఇవ్వలేదని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ మాపియా చేస్తే దాడులు నిర్వహించి వాహనాలు పట్టుకొని కేసులు నమోదుచేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

# రూపురేఖలు మారనున్న స్వర్ణముఖి

### వివ్యూపాయింట్‌ల ఏర్పాటుకు సూచన

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణం పుణ్యక్షేత్రం. శ్రీకాళహస్తీశ్వరాలయానికి పక్కనేఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి రూపు రేఖలను 'శివం టు శివం రోడ్డు' నిర్మాణంతో మార్చుటకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి నిర్ణయించారు. ఎన్నో సంవత్సరాలుగా ఆచరణకు నోచుకోని ఈ రోడ్డును శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పట్టుబట్టి పూర్తి చేయుటకు నిర్ణయం తీసుకున్నారు. మంగళ స్వర్ణముఖి నదిలోని దుర్గాంబ కొండ దిగువన ఉన్న హస్తి తీర్థం వద్ద కొండలో ఏర్పడ్డ సహాజ సిద్ద ఏనుగు ఆకారం శిలను ఎంఎల్ఏ పరిశీలించారు. శివం టు శివం రోడ్డు నిర్మాణానికి గత తెలుగుదేశం ప్రభుత్వంలో ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా ఉన్న పోతుగుంట గురవయ్యానాయుడు ధర్మకర్తల మండలిలో తీర్మానించారు. టెండర్లు పిలిచారు. అయితే అప్పట్లో సాధ్యం కాలేదు. తరువాత వైకాపా పాలకులు అధికారంలోకి రాగా ఏడేళ్ళ క్రితం ఏడు కోట్లు రూపాయలతో ప్రతిపాదించిన రోడ్డును ఏకంగా రూ.33కోట్లకు అంచనాలు పెంచుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ప్రతిపాదనను పరిశీలించిన శాసనభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రభుత్వానికి దేవాదాయశాఖతో చర్చించారు. రూ.29కోట్లతో టెండర్లు పిలిచారు. ఈ పనులను ప్రారంభించుటకు కాంట్రాక్టర్లు రాగా సుధీర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో రోడ్డు నిర్మాణానికి సంబంధించి పరిశీలించారు. కాంట్రాక్టర్లు ఆయనకు రోడ్డు పయనించే మార్గాన్ని వివరించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే పట్టణంలో కొంత వరకు ట్రాపిక్ రద్ది తగ్గవచ్చునని భావిస్తున్నారు. నెల్లూరు, విజయవాడల వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. అంతేకాకుండా ఈ రోడ్డు నిర్మాణంతో పాటు స్వర్ణముఖి ఆనకట్ట ఆధునీకరణలతో పట్టణం సర్వాంగ సుందరంగా మారుతుందనటంలో సందేహం లేదు. పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ బియస్‌గిరికుమార్ పార్టీ నాయకులు వవిజయకుమార్‌నాయుడు, చెంచయ్యనాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణముఖిలో పరిశీలిస్తున్న దృశ్యం

## నేడు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు
# అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

చిత్తూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

అసెంబ్లీ పద్దుల కమిటీ బుధవారం జిల్లాకు రానుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ పద్దుల కమిటీ ఛైర్మన్ జోగేశ్వరరావుతో పాటు 11 మంది సభ్యులతో కూడిన అసెంబ్లీ పద్దుల కమిటీ బుధవారం ఉదయం తిరుపతిలో బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు ఆర్అండ్‌బి అతిధి గృహం చేరుకుంటుందని, మధ్యాహ్నం 2 గంటలకు జడ్పీ సమావేశభవనంలో సమీక్షా సమావేశం నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్తుందని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కమిటీ సభ్యులుగా భూమా అఖిల ప్రియ, బండారు సత్యానందరావు, జయకృష్ణ నిమ్మక, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారధి వాల్మీకి, పాసిం సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్‌బాబు, డాక్టర్ వరహ వెంకట సూర్యనారాయణ రాజు పెనమస్త, వరుదు కళ్యాణిలు వుండనున్నారన్నారు.

### తిరుపతిలో

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం అసెంబ్లీ పద్దుల కమిటి జిల్లాకు రానుందని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ పద్దుల కమిటి ఛైర్మన్ జోగేశ్వరరావుతో పాటు 11 మంది సభ్యులతో కూడిన పద్దుల కమిటి ఏప్రిల్ 15న విజయవాడ నుంచి రాత్రి బయలు దేరి 16వ తేది ఉదయం 5.15 గంటలకు తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుని అనంతరం 11 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి చిత్తూరు జిల్లా సమీక్ష ముగించుకుని, సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలు దేరి రాత్రి 7.30 గంటలకు తిరుమల చేరుకుని రాత్రి బస చేసి 17వ తేది ఉదయం శ్రీవారి దర్శనం చేసుకుని 10 గంటలకు తిరుమల నుంచి బయలు దేరి తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహం నందు టీటీడీ ఈవో, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5.15 గంటలకు రైలు మార్గం ద్వారా విజయవాడ తిరుగు ప్రయాణం కానున్నారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## పివికెయన్ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

**చిత్తూరురూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** చిత్తూరునగరం, పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు బుధవారం నుంచి కళాశాలలో ప్రవేశం కొరకు అడ్మిషన్ హెల్ప్‌డెస్కును ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. జీవనజ్యోతి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో ప్రవేశాల కొరకు ఈ హెల్ప్‌డెస్కును సంప్రదించవచ్చునని, ఎటువంటి సందేహాలు వున్న సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. ఈ హెల్ప్‌డెస్క్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గర్భవతులు, బాలింతలు ఫౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



తల్లి బిడ్డ సురక్షితంగా వుండాలంటే గర్భవతులు, బాలింతలు ఫౌష్టికాహారం తీసుకోవాలని ఐరాల ఐసిడీఎస్ సీడీపీఓ జి.నిర్మల అన్నారు. మంగళవారం మండలంలోని సిద్దంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 8 నుండి 22వ తేదీ వరకు జరుగుతున్న ఫౌష్టికాహార వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ గర్భవతి అయిన నాటి నుండి ప్రసవమయిన వెయ్యి రోజుల వరకు తల్లి తీసుకునే ఆహారం, అలవాట్లు మీద బిడ్డ జీవితం అధారపడి వుంటుందని తెలిపారు. కావున గర్భిణీలు, బాలింతలుఫౌష్టాకాహారం తీసుకోవాలని, బిడ్డ జన్మించిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని, బిడ్డ ఏడు నెలల నుండి తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు,గుడ్లు బాలామృతం, తప్పనిసరిగా అందించాలని సీడీపీఓ నిర్మల సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలసికట్టుగా మండల అభివృద్ధికి సహకారం



– ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి పిలుపు

పెనుమూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

మండల సర్వతోముఖాభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరు కలసికట్టుగా ముందుకు రావాలని ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గుంటుపల్లి పంచాయతీ కనికాపురం గ్రామంలో మంగళవారం ఎంపిపి హేమలత సురేష్‌రెడ్డి 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రజల దాహార్తి తీర్చడానికి రూ.5 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో మండల పరిషత్ నిధులు రూ.2.5 లక్షలు, పంచాయతీ నిధులు రూ.2.5 లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైకాపా కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి, వైకాపా నాయకులు మహాసముద్రం ప్రతాప్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, కారేటి గోవిందరెడ్డి, ఎన్.నరసింహారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెన్నకేశవనాయుడు, భూపతినాయుడు, నక్క సుబ్రమణ్యంరెడ్డి, వైస్ ఎంపిపి కోదండన్, ఎంపిటిసి శివలింగం, సర్పంచ్‌లు దూది వెంకటేష్, మునిరత్నంరెడ్డి, పులిచెర్ల ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంలోనే ఆరోగ్య జీవితం

గుడిపాల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



ప్రతి ఒక్కరు పౌష్టికాహారం, పోషకాలు నిండిన ఆహార పదర్థాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్య జీవితం గడపవ చ్చునని వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ పేర్కొన్నారు. వసంతాపురం సచివాలయంలో మంగళ వారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ రజనీకాంత్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాలు, పండ్లు, తాజా కూరగాయలు, ఆకుకూరలు వంటి పౌష్టిక విలువలు కూడిన ఆహారంను తగినంతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌష్టికాహార పదర్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ విజయలక్ష్మి, సిహెచ్‌ఓ బాల సూర్యనారాయణ, విఆర్‌ఓ శ్రీనాథ్, సచివాలయ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలు లేకుండా చేయడమే లక్ష్యం

పాలసముద్రం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో భూసమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టరేట్ ఎఓ కులశేఖర్ పేర్కొన్నారు. స్థానిక తహసిల్దారు కార్యాలయంకు మంగళవారం విచ్చేసిన కలెక్టరేట్ ఎఓ కులశేఖర్ రెవెన్యూ సదస్సులు, రీ-సర్వేలో రైతుల నుండి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు సక్రమంగా సమస్యలు పరిష్కరించి పూర్తి చేశారా! లైదా! అని పరిశీలించారు. అలాగే ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కారం అయ్యాయా! లేదా! అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, రీ-సర్వే ద్వారా వచ్చిన పిటీషన్‌దారులకు నోటీసులు ఇచ్చి ఆ నోటీసులను ఫైల్స్‌తో పాటు వుంచాలన్నారు. సమస్యలు మళ్ళీ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు అరుణకుమారి, ఆర్‌ఎస్‌డిటి జెవి ప్రవీణ్‌కుమార్, డిటి కిరణ్‌కుమార్, ఎంఆర్‌ఐ దేవి, విఆర్‌ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తికి సత్కారం

చిత్తూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



ఎపి పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాయలసీమ జోనల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పూతలపట్టు పిహెచ్‌సి సిహెచ్‌ఓ బి.శ్రీనివాసమూర్తిని మంగళవారం పూతలపట్టు పిహెచ్‌సిలో జిల్లా ఎపి పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనిన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సత్కారం చేశారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి భోగేశ్వరపిళ్ళై, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జ్ఞానశేఖర్‌లు శ్రీనివాసమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు పిహెచ్‌సి డాక్టర్ ప్రియాంక, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త



ప్రజలకు అగ్ని ప్రమాదాలు పట్ల అవగాహన అవస రమని అగ్ని మాపక కేంద్ర అధికారి సుబ్బరాజు పేర్కొ న్నారు. మంగళవారం ఉదయం అగ్నిమాపక వారోత్స వాల సందర్బంగా రెండవ రోజు పుంగనూరు టౌన్ నందు అగ్నిమాపక సిబ్బంది, వాహనం ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మదనపల్లి రోడ్డు మీదుగా కొత్త ఇండ్లు ఆపై వరకు వెళ్లి తిరిగి న్యూ ఎమ్మార్వో ఆఫీస్ సర్కిల్ నందు అగ్నిమాపక వారోత్సవాల సందర్బంగా రెండవ రోజు అగ్ని ప్రమాదాలు ఏ విధంగా నివారించే విధానాలను పుర ప్రజలకు కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

కుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మక కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మంగళవారం సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి స్థలం మార్పిడి కోసం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దీంతో కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఇదివరకే కేంద్రీయ విద్యాలయం కోసం కుప్పం మండలం కృష్ణదాసనపల్లి వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రాథమికంగా భూములు పరిశీలించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా ఇదివరకే ఉమ్మడి జిల్లాలో చిత్తూరుకు కేంద్రీయ విద్యాలయంమంజూరుకాగా తాజాగా కుప్పంలో సైతం ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది.

## గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణంకు చర్యలు



– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

గాండ్ల కులస్తుల సౌకర్యార్థం కుప్పంలో గాండ్ల సామాజిక భవన నిర్మాణంకు తగు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం సమీపంలో గాండ్ల కమ్యూనిటీ భవనం నిర్మాణంకు కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దాదాపు రెండు ఎకరాలకు పైబడి గాండ్ల కమ్యూనిటీ భవనంకు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. త్వరలోనే కమ్యూనిటీ భవనం స్థలంకు ప్రహరీగోడ నిర్మాణంతో పాటు భూమి చదును చేసిన అనంతరం శంకుస్థాపన కార్యక్రమం సైతం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సంఘ నేతలు కెవెల్ నారాయణ, బేటప్ప, నేతలు చౌడప్ప,చలపతి, ప్రతాప్,మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి

సదుం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త



గర్బవతులు, చిన్నపిల్లలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగమణి అన్నారు. మంగళవారం సదుం గ్రామ పంచాయతీ బట్టువారి పల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్బవతులు గర్బస్థ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం దాని వలన ప్రయోజనాలు, రక్తహీనత నివారణ, పిండం ఎదుగుదల, అవయవాలు ఎదుగుదల, సుఖ ప్రసవం, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ తరపున వడదెబ్బ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్ఎస్ ద్రావణం తయారీ దానివలన ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మల్లీశ్వరి, ఆరోగ్య పర్యవేక్షక సిబ్బంది జానకి, శిఖామణి, నీలకంఠ, ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఆరోగ్య కార్యకర్త హేమలత ,ఆశా కార్యకర్త మల్లేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు గర్బవతులు పాల్గొన్నారు.

## 17న సర్వసభ సమావేశం

పూతలపట్టు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

మండల పరిషత్ సర్వసభ సమావేశాన్ని ఈ నెల 17వ తేది గురువారం నిర్వహించినట్లు ఎంపీడీవో నాగరాజా ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ ఉన్న కుమారి జడ్పిటిసి దేవికతో పాటు వివిధ శాఖల అధికారులు తమ నివేదికతో హాజరవ్వాలని ఎంపీడీవో తెలిపారు. మొత్తం మండలంలో 21 శాఖలు ఉన్నాయని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు సర్వసభ సమావేశం ప్రారంభం వుతుందన్నారు.

## సీనియర్ అసిస్టెంట్ అన్సర్ భాష గుండెపోటుతో మృతి

పూతలపట్టు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

మండలంలోని సీనియర్ అసిస్టెంట్‌గా రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న అన్సర్ భాష (58) మంగళవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. పూతలపట్టు తాసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది తీరని లోటని వ్యక్తం చేశారు.

## ఉగాది పురస్కార గ్రహీతకు సత్కారం

చిత్తూరురూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకొన్న తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంను నవ్యాంధ్రరచయితల సంఘ జిల్లా అధ్యక్షురాలు కరణం విమల మంగళవారం ఘనంగా సత్కరించారు. తన జీవితాన్ని తెలుగుభాష రక్షణకే వినియోగిస్తూ, ఇప్పటివరకు లక్ష అరవైవేల పుస్తకాలను విద్యార్థులకు పంచిపెట్టి, రూ.50లక్షల విలువైన సొంత కళామందిరాన్ని భాషా సాహిత్య కార్యక్రమాలకు వినియోగించడం గొప్పవిషయమని తులసీనాథంను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిట్టాలక్ష్మీ, సంధ్యాశర్మ, పరంధామనాయుడు, వెంకటేష్, మిట్టాశ్రీనివాసులు, వాణిశ్రీ, శబరీష్, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## సిఐను కలిసిన ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణం, ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మహేశ్వర్‌ను ఎస్సీ,ఎస్టీ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సిఐని కలిసిన వారిలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరంగంపల్లి మునస్వామి, ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఆర్ముగం, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, ఏపి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఇంద్రాణి, జిల్లా కార్యవర్గసభ్యుడు సతీఫ్, ఏపిఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు వీరప్పన్, సుప్రియ, పుష్పమాలతి, కోమల, సుగుణ వున్నారు.

## వేసవి కోచింగ్ శిబిరాల నిర్వహణకు ధరఖాస్తులు ఆహ్వానం

చిత్తూరురూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 1నుంచి 31వ తేదివరకు వార్షిక వేసవి కోచింగ్ శిబిరాల నిర్వహణ, వేదికలను చిత్తూరు జిల్లాలో నిర్వహించుటకు ఆసక్తి కలిగిన పిడి, పిఇటి క్రీడా అసోసియేషన్, సీనియర్ ప్లేయర్స్ నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈనెల 17వ తేది సాయంత్రం 5గంటలలోపు ధరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కంటి సమస్యలపై అజాగ్రత్త వద్దు : పవన్

చౌడేపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



కంటి సమస్యలపై అజాగ్రత్త తీసుకోరాదని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో కర్ణాటక రాష్ట్రం కోలారు జాలప్ప ఆసుపత్రిచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వయసు మీరేకొద్దీ కంటి సమస్యలు వస్తుంటాయనీ, నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేసారు. శిబిరంలో 3గ్గురు వ్యక్తులను శస్త్రచికిత్సకు తరలించారు. కంటి వైద్య నిపుణులు రోహిత్‌రెడ్డి, అర్చలారెడ్డి, జాలప్ప ఆసుపత్రి, స్థానిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకు రెడ్డెప్పకు దక్కిన అరుదైన గౌరవం

చౌడేపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకుడు బ్యాంకు రెడ్డెప్పకు యూనియన్ సమావేశంలో అరుదైన గౌరవం లభించింది. విజయవాడలో జరిగిన రెండు రోజుల యూనియన్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. యేళ్ళ తరబడి బ్యాంకు రెడ్డెప్ప యూనియన్ అభివృద్ధి, ప్రజా సేవలను గుర్తించిన నాయకులు సిపిఐ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరావు, ఆప్కాబ్ ఛైర్మన్ టిడీ జనార్ధన్ తదితర సమక్షంలో ఘనంగా సన్మానించారు. సహకార బ్యాంకు రైతులకు మరింత చేరువ కావాలనీ, వడ్డీ తగ్గించేందుకు రెండంచల విధానం తేవాలని ఆయన ఆకాంక్షించారు.

## మహాభారత ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్సలు నిషేధించండి

నగరి డిఎస్పీ మహ్మద్ అజీజ్



వెదురుకుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :

మహాభారత వార్షిక ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్సలు నిషేదించాలని, సీసీ కెమోరాల పర్యవేక్షణలో మహాభారతం ఉత్సవాలు నిర్వహణకు ధర్మకర్తల మండలి చర్యలు తీసుకోవాలని నగరి డిఎస్పీ ఎస్. మహ్మద్ అజీజ్ ఆదేశించారు. వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మండలంలోని ఆరు మహాభారత ఆలయ ధర్మకర్తల మండలితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇతిహాస గాథాలను ప్రజలకు తెలియాజేసి ఆధ్యాత్మిక చింతన పెంపొందించి, ప్రవర్తనలో మార్పు తీసుకురావడం కొరకు నిర్వహించే ఉత్సవాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నమయ్యే రికార్డింగ్ డ్యాన్సులు నిషేధించి, ఇతిహాసగాథాలను ప్రదర్శించాలని చెప్పారు. అందరి సహకరంతో వివాదాలకు తావులేకుండా స్నేహపూరిత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆవుదేవర నందీశ్వర, చవటగుంట మహాభారత ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణ రెడ్డి, పచ్చికాపల్లం ఆలయ ధర్మకర్త బొజ్జా రెడ్డి, మొరవ ఆలయ ధర్మకర్త బోడి రెడ్డి తారక రెడ్డి, చెంచుగుడి ఆలయ ధర్మకర్త వెంకట్రామా రెడ్డి, నల్లవెంగనపల్లె ఆలయ ధర్మకర్త వెంకటేష్ నాయుడు, జక్కదొన ఆలయ ధర్మకర్త మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సన్మానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని మంగళవారం గంగాధర నెల్లూరు నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలు పుత్తూరు రాధిక పురంధర్ రెడ్డి సన్మానించారు. పుత్తూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి దుశాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర వైసీపీ రాజకీయ వ్యవహారల కమిటీ సభ్యులుగా ఆయనకు స్థానం కల్పించడంపై అభినందించారు. పార్టీలో మీ సేవలకు గుర్తింపుగా మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పెరుమాళ్ళపల్లె ఎంపిటిసి సభ్యులు తోకల మురళి రెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ గఫూర్, నాయకులు పురంధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపల్లెలో శ్రీరామనవమి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :



మండలంలోని పెరుమాళ్ళపల్లెలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కొదండరామస్వామి ఆలయం లో మంగళవారం వ్యవస్థాపక ధర్మకర్త గురుస్వామి రెడ్డి కుమారులు రాంప్రసాద్, కృష్ణప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుల మంత్రోచ్చరణ నడుమ ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దైవదర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి శశిఆనంద రెడ్డి, స్థానికులు ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌చే రూ. లక్ష విరాళం

కుప్పం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతర నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ తనవంతుగా రూ 1,01116ల విరాళాన్ని అందజేశారు. సోమవారం రాత్రి అమ్మవారి ఆలయంలో జాతరకు సంబంధించిన పత్రికలను అమ్మవారి ఎదుట ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం జాతర ఆహ్వానపత్రికలను ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల ఆవిష్కరించారు. జాతర నిర్వహణకు అధికార యంత్రాంగాన్ని సైతం తగు సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కాగా మే 20,21 తేదీల్లో అమ్మవారి జాతర జరగనుంది. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, కమిటీ సభ్యులు, స్థానిక నేతలు, అర్చకులు సోముస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జనన ధృవీకరణపత్రాలు సకాలంలో మంజూరు చేయాలి.

పెద్దపంజాణి ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



పిల్లలకు సంబంధించిన జనన ధ్రువీకరణ పత్రాలను సచివాలయ ఉద్యోగులు సకాలంలో మంజూరు చే యాలని ఎంపిడిఓ బాలాజి ఆదేశించారు. మంగళ వారం లింగాపురం సచివాలయాన్ని ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రిజిష్టర్లు పరి శీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జననధ్రువీకరణ పత్రాలు పొందిన అనంతరం పిల్లలకు ఆధార్‌కార్డులకోసం దరఖాస్తుచే యించాలన్నారు. మండలంలో ఇంకా 85మంది పిల్లలకు జననధ్రువీకరణ పత్రాలు మంజూరుచేయాల్సి ఉందన్నారు. 0-6ఏళ్ళపిల్లలకు తప్పకుండా ఆధార్‌కార్డులు చేయించాలని ఆయన ఆదేశించారు.

## అమ్మరాజుపల్లిలో జోరుగా పారిశుధ్యపనులు.

పెద్దపంజాణి ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



మండలంలోని అమ్మరాజుపల్లిలో మంగళవారం పారిశుధ్య పనులను జోరుగా చేయించారు. ఈఓపీ ఆర్‌డి శారదాదేవి గ్రామంలో పారిశుధ్యపనులను దగ్గరుండి చేయించారు. రోడ్డుపక్కన ఉన్న ముళ్ళ పొదలు చెత్తాచెదారాలు తొలగించి గ్రామంలో ఉన్న కాలువలను శుభ్రపరిచారు.ఈ నెల 25వ తేదీ వరకు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను జిల్లా కలెక్టర్,ఎంపిడీఓ ఆదేశాలతో చేపడతామని ఆమె తెలిపారు.

## వార్షిక వేసవి క్రీడా కోచింగ్ శిబిరాలు ఏర్పాటుకు దరహాస్తులు ఆహ్వానం

చిత్తూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: జిల్లాలో మే 1 నుండి 31వ తేదీ వరకు వార్షిక వేసవి క్రీడా కోచింగ్ శిబిరాలు నిర్వహించడానికి గుర్తించబడిన కోచింగ్ శిబిరాలు, వేదికలను నిర్వహించడానికి ఆసక్తి కలిగిన పిడి, పిఇటి, క్రీడా అసోసియేషన్‌ల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.బాలాజీ ఓ ప్రకటనలో కోరారు. 2025-26 సంవత్సరానికి వార్షిక వేసవి క్రీడా కోచింగ్ శిబిరాలు నిర్వహించడం ప్రధాన లక్ష్యం 8-14 సంవత్సరాల వయస్సు పిల్లలను క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వడం, చిన్నవయస్సులోనే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వేసవి సెలవులు ఉపయోగించుకుని క్రీడలను కొనసాగించడానికి వారిని ప్రేరేపించడం, చిన్న వయస్సులోనే ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడం అన్నారు. ఈ క్రీడా శిబిరాలు ఉదయం 6 నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు జరుగుతుందన్నారు. క్రీడా శిబిరాలు నిర్వహించాలనుకునే వారు ఏప్రిల్ 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం..ఎంఎల్ఏ

తొట్టంబేడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి బాధితులకు పంపిణీచేశారు. ఈసందర్భంగా మొత్తం 46మందికి రూ.52,72,669లక్షల నగదు చెక్కు రూపంలో అందించారు. వైద్యఖర్చులకు సంబంధించి సిఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ఈసందర్భంగా ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందించడమే ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. ఆయన సారథ్యంలో ప్రజలు, కార్యకర్తలు, నాయకులు సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, ఎస్‌టి సెల్ అధ్యక్షులు సుబ్బయ్య, వన్నెకుల క్షత్రియ రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, మునిరాజ యాదవ్, పాలసరఫరా సంఘం మాజీ అధ్యక్షుడు రావిళ్ళమునిరాజనాయుడు పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత కంటివైద్యశిబిరానికి విశేష స్పందన

.తొట్టంబేడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త

దివంగతనేత మాజీ మంత్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆయన కుమారుడు ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సారథ్యంలో పార్టీ కార్యాలయంలో ఉచిత కంటివైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ తొలుత పార్టీ కార్యాలయంలో దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం ప్రముఖ కంటివైద్యనిపుణులతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యిమందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించుకుని వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీచేయడంతో పాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. ముందుగా ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, అనంతరం రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి), మాజీ పాలసరఫరా ఛైర్మన్ మునిరాజనాయుడు, పేట బాలాజీరెడ్డి, రంగినేని చెంచయ్యనాయుడు, కొన్నలిరమేష్, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడులతో పాటు పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో ప్రత్యేక పూజలు-అన్నదానం

.తొట్టంబేడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



దివంగత నేత స్వర్గీయ బొజ్జలగోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలోని కొత్తపేటలో కార్గిల్ సెంటర్ వద్ద ఉన్న వరసిద్దివినాయక ఆలయంలో ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేపూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుండేలా చేస్తామని ఎంఎల్ఏ తెలిపారు. స్థానిక ఎస్ఎస్ కళ్యాణమండపంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో సుమారు వెయ్యిమంది నిరుద్యోగులు ఎంపికవ్వడం ఎంతో హర్షణీయం అన్నారు. అనంతరం మాజీ కౌన్సిరల్ శెంజిగరం సుప్రజ, నాయకులు శెంజిగరం వేలు సారథ్యంలో ప్రత్యేకంగా రూపొందించిన కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎక్కడ ఏసమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని దాన్ని వెంటనే పరిష్కరిస్తామని ఎంఎల్ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి మాజీ కౌన్సిలర్ సుప్రజలకు సూచించారు.

## ప్రధాన మంత్రి జన ఔషద కేంద్రాన్ని పరిశీలించిన ఎంఎల్ఏ

.తొట్టంబేడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



ప్రధానమంత్రి జన ఔషద కేంద్రంను శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీచేశారు. పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఏడుగంగమ్మలగుడి పక్కనే ఉన్న ప్రధానమంత్రి జన ఔషద కేంద్రాన్ని సందర్శించి పలుసూచనలు సలహాలు ఇచ్చారు. ఎంతో మహోన్నత ఆశయంలో కేంద్రప్రభుత్వం నిరుపేదలకు తక్కువ ధరలు మందులను అందించాలన్న ఉద్దేశంతో ఈకేంద్రాలను ఏర్పాటు చేసిందని ఇక్కడ ఉన్న సిబ్బంది కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలు నిత్యం వాడే బిపి, షుగర్, గుండె సంబందిత మందులు ప్రజలు ఉపయోగించుకోవాలని అలాగే ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి పథకాలు రావాలని తెలిపారు. ప్రధాన మంత్రి జన ఔషద కేంద్రాన్ని చక్కగా నడుపుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంఎల్ఏతో పాటు పట్టణ అధ్యక్షులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల ఊరేగింపు

వడమాలపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



మండలంలోని తట్నేరి, గొల్లపల్లిలో సీతారాముల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం ఉదయం అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం, ఉట్లోత్సవం నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో అలంకరించి మేళతాళాల భక్తుల కోలాటాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నారికేళ కర్పూర హారతులు ఇచ్చారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక అభిషేకాలు: జాతర సంబరాలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర సంబరాలు ప్రారంభమయ్యాయి.మంగళవారం జాతర సందర్బంగా అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. జాతర శ్రీకారానికి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి వారి సిబ్బంది హాజరు కాగా ధూప,దీపనైవేద్యాలు,పుష్పపాలతో అలంకరించారు. మంగళవారం మైల ముగ్గు, శేషపాన్పు నిర్వహించారు.

***సారె బహూకరణ:***

శ్రీకాళహస్తీశ్వరాలయంకు అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతరకు మహిళా భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఆలయం మహిళాభక్తులతో కిట కిట లాడింది. సాధారణంగానే మంగళవారం అమ్మవారికి ఆలయానికి పట్టణంలోని నలుమూలల నుంచి మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతారు.జాతరకు ఇక జనమేజనం అన్నట్లు మారింది.ఈ సందర్బంగా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఎఇఓ హేమామాలిని సూపరింటెండెంట్ రవి, సిఎస్ఓ నాగభూషణం యాదవ్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్యల సారథ్యంలో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసుకొచ్చారు. ముత్యాలమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తరువాతపోతురాజు, గెరిగెలకు పూజలు జరిపారు.

## మున్సిపల్ కార్మికులకు యూనిఫాం పంపిణి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు, మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 75 జన్మదిన వేడుకల సందర్భంగా తెలుగుదేశం పార్టీ పలు సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫారాలు పంపిణీని నిర్వహించారు. సుధీర్‌రెడ్డి తన సహాచరులతో మున్సిపల్ కార్యాలయం వద్దకు రాగా అక్కడ ఆయనకు ఘనస్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ బియస్‌గిరి కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్లు బాల,మోతీలాల్‌ల పర్యవేక్షణలో సిబ్బంది ఘనస్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ సుధీర్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు.ఈ సందర్బంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్మికులకు యూనిఫారాలు,టెంకాయనూనె, వాషింగ్ పౌడర్లను అందించారు. ఈకార్యక్రమాల్లో ఎంఎల్ఏ సతీమణి బొజ్జల రిషితారెడ్డి,సుమతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్,చెంచయ్యనాయుడు షాకిర్ అలి తదితరులు పాల్గొన్నారు.

## జన నాయకుని జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో మంగళవారం జననాయకుడు మాజీ మంత్రి దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 75వ జన్మదిన వేడుకలను కుటుంబసభ్యులు,తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా జరిపారు. మంగళవారం ఉదయం మొదట కుటుంబసభ్యులందరూ కలసి గ్రామ పొలిమేరల్లోని బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. ప్రత్యేక పూజలు జరిపారు. తరువాత వారి స్వగృహంలో నిరాడంబరంగా కుటుంబసభ్యులు కొందరు పార్టీ నాయకులు మహిళా గ్రూప్ సభ్యులతో కేక్ కట్ చేసారు.ఈ కార్యక్రమాల్లో డాక్టర్ కె.గెరటారెడ్డి రాము,రావిళ్ళ మునిరాజానాయుడు, బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డి,మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృత వర్సిటీలో హిందీ భాష పైన శిక్షణ

తిరుపతి విద్య ఏప్రిల్ 15 ప్రభాత వార్త



జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో హిందీ విభాగం అధ్యాపకులు డా.వేద ప్రకాష్ బోర్కర్ ఆధ్వర్యంలో ఒకరోజు హిందీ భాష, కార్యలీయ ప్రశాసనములు,హిందీ పైన మెలకువలు అనే అంశం పైన వర్క్ షాప్ ను మంగళవారం నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రత్యేకించి విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి బోధనేతర సిబ్బంది ఎవరైతే ఉన్నారో,వారికి హిందీ టైపింగ్,హిందీ డాక్యుమెంట్ ప్రిపరేషన్, హిందీ స్పీకింగ్,హిందీ కౌశలాలు మొ.అంశాలపైన శిక్షణ ఇవ్వడం జరిగింది. అనంతరం విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి ఆయోజకులైనటువంటి డా.వేద ప్రకాష్ బోర్కర్ ను అభినందిస్తూ, ఎవరైతే బోధనేతర సిబ్బంది ఈ వర్క్ షాప్ లో పాల్గొని వివిధ కౌశలాలు నేర్చుకున్నారో వాళ్ళందర్నీ కూడా అభినందించి,వారికి ప్రమాణ పత్రాలను ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ప్రతి ఒక్కరు కూడా హిందీ భాషను బాగా నేర్చుకొని హిందీ భాష ద్వారా భారతీయ రాష్ట్ర భాష ఔన్నత్యాన్ని పెంచాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బంది పాల్గొని శిక్షణ పొందడం జరిగింది.

## సన్ ప్రైమ్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :



తిరుపతి సన్ ప్రైమ్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స అందించినట్లు క్రిటికల్ కేర్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. తిరుపతి ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని సన్ ప్రైమ్ ఆస్పత్రిలో పుత్తూరుకు చెందిన 20 సంవత్సరాల వయస్సు గల సుధీర్ అనే యువకుడు కార్టిక్ షాక్‌తో చేరాడు. అతనికి బీపీ,పల్స్ పడి పోయాయి. ఎమర్జెన్సీ ట్రీట్మెంట్ ప్రారంభించిన లైఫ్ సేవ్ చేయగలిగామని పేర్కొన్నారు.రుడో బిటమైన్, అడ్రినలిన్ మందులను క్రమ తప్పకుండా ఇస్తూ వెంటిలేటర్ సహాయంతో రికవరీ చేశామని వివరించారు. 10 రోజుల తర్వాత శస్త్ర చికిత్స లేకుండా కేవలం మందులతోనే నయం చేయగలిగామని తెలిపారు. తమ వద్ద 24 గంటల ఎమర్జెన్సీ ట్రామా అండ్ గైనకాలజీ సేవలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. తమ వద్ద 24 గంటల ఎమర్జెన్సీ ట్రామా అండ్ గైనకాలజీ సేవలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో వైద్యులు ఆర్థో అండ్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ పవన్, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీతేజ, డెంటల్ డాక్టర్ అనిత, నిర్వాహకులు ఉప్పలపాటి సాయి చౌదరి, పేషంట్ సుధీర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మిట్టకండ్రిగ వద్ద రోడ్డు ప్రమాదం-ఒకరి మృతి

.శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు అర్బన్‌సిఐ గోపి తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మిట్టకండ్రిగ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న గుర్తు తెలియనివ్యక్తిని శ్రీకాళహస్తి డిపో బస్సు డీకొనడంతో సదరు పాదాచారి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. కేసునమోదు చేయడంతో పాటు బస్సును సీజ్‌చేశామని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

## పోషణపక్వాడాపై అవగాహన

.తొట్టంబేడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



మండలంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడాపై అవగాహన కార్యక్రామన్ని నిర్వహించారు. ఈసందర్బంగా సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల సంరక్షణ పట్ల గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. పిల్లలు కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లుల పోషకాహార లోపాలను తగ్గించడానికి వారి ఆరోగ్యాలను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలందరికీ కుటుంబసభ్యులకు పిల్లల ఆహార ఆరోగ్యాలవాట్లు, వండే పద్ధతులు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పోషక విలువలతో కూడిన పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సురేఖ, మునిలక్ష్మి, భారతీ, మణెమ్మ,లక్ష్మి, పద్మమ్మ, కౌసల్య, అంగన్‌వాడీ సహాయకురాలుజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీకాంకు ఉన్నత విద్యామండలి ప్రశంస

తిరుపతి విద్య ఏప్రిల్ 15 ప్రభాత వార్త

ఇటీవల నాక్ బీప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిన సీకాం డిగ్రీ కళాశాలపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి క్వాలిటీ అసూరెన్స్ సెల్ ప్రశంసలు కురిపించింది. నాక్ అక్రిడేషన్ గుర్తింపు పొంది విద్యారంగంలో అరుదైన మైలురాయిని అదురోహించిందని కొనియాడింది.ఈ మేరకు మంగళవారం కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్,అధ్యాపక బృందానికి అభినందనలు తెలుపుతూ ఏపీఎస్సీహెచ్ఇ క్యూఏసీ వైస్ ఛైర్మన్, డైరెక్టర్ ప్రొఫెసర్ కే రామమోహన్రావు ప్రత్యేక సందేశాన్ని ప్రిన్సిపల్కు పంపారు. ఇందులో ప్రధానంగా నాణ్యమైన విద్య, నిపుణులైన అధ్యపకులు,స్కిల్ డెవలప్మెంట్ ప్రొగ్రాంలు, కళాశాలలో మౌలిక వసతుల కల్పనపై నాక్ హర్షం వ్యక్తం చేస్తూ బీప్లస్ ప్లస్ గ్రేడ్ ను అందించడం అభినందనీయమని ఆ లేఖలో ఆయన తెలిపారు.

## శ్రీహరిపురంలో ఘనంగా సీతారామ వసంతోత్సవం

విజయపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



విజయపురం మండలం శ్రీహరిపురం శ్రీరామ మందిరంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారామ వసంతోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వసంతోత్సవం అనంతరం గ్రామంలో సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. రామ నామం జపంతో భక్తులు పరవశించారు.

## వైసీపీ మండల కమిటీ నియామకం

విజయపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

వైసీపీ విజయపురం మండల కమిటీ నియామకాన్ని పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఇందులో మండల వైస్ ప్రెసిడెంట్‌గా దేగ సతీష్ యాదవ్, ఏ.గోవిందరాజు, ప్రధాన కార్యదర్శులుగా కె.పరంధామయాదవ్, బి.సురేష్, ఎస్.రమేష్, కార్యదర్శులుగా కె.శేషాద్రి, వి.రమేష్, హెచ్.కుమార్, ఆర్.అంగముత్తు, డి.రవివర్మలను నియమించగా కార్య నిర్వాహక కార్యదర్శులుగా సి.గిరిబాబు, వెంకటేశం, ఎస్.విష్ణు, ఎన్.నాగేంద్ర, పి.వి.చెల్లప్ప, జి.బాబు, పి.పరంధామంలు నియామకమయ్యారు.మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ మా మీద నమ్మకం ఉంచి, మమ్మలను నియమించుటకు కృషి చేసిన మాజీ మంత్రి రోజాకు, పార్టీ అధినేత జగన్మోహన్‌కు, ఇతర రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కన్నుల పండువగా శ్రీరామ పట్టాభిషేకం

చంద్రగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి పట్టాభిషేక మహోత్సవం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. ఇందులో భాగంగా వేకువజామున స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీసీతారామ లక్ష్మణభరత శత్రుఘ్నులకు, శ్రీఆంజనేయస్వామి వారికి అభిషేకం జరిపించారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించారు. ఉదయం 10.30 గంటల నుండి 11.30వరకు శ్రీరామపట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని శ్రీసీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ మునిహరిబాబు, సీనియర్ అసిస్టెంట్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఔషధాల ప్యాకింగ్‌లో ప్రమాణాలు పాటించాలి..!

రామచంద్రాపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:




ఔషధాల ప్యాకింగ్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ డిప్యూటీ డైరెక్టర్ నటరాజన్ అన్నారు. మంగళవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఔషధాల ప్యాకింగ్, ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాకేజింగ్ ఔషధం యొక్క భౌతిక, రసాయనిక లక్షణాలను అనుగుణంగా వున్నట్లయితే తద్వారా ఔషధ నాణ్యతను పెంపొందించవచ్చున్నారు. నూతన ఔషధాల తయారీలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రాజు, బోధనా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ పని ముట్లు పంపిణీ

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలో రైతులకు సరఫరా చేయు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వ్యవసాయంత్రీకరణ పరికరాలను రైతులకు ఎన్నడూ కూడా వ్యక్తిగతంగా ఇవ్వలేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, పనిముట్లు రైతులకు వ్యక్తిగతంగా 50 శాతం సబ్సిడీలో సరఫరా చేసి తద్వారా రైతులకు అధిక దిగుబడి సాధించడానికి ప్రోత్సహిస్తూ ఉందని, రాబోవు రోజుల్లో ఇంకా ఎక్కువగా ఆధునిక యంత్ర పరికరాలు డ్రోన్లు, హైకాస్ట్ మిషనరీస్ సబ్సిడీలో ఇచ్చి వ్యవసాయం లాభసాటిగా మరలచాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు. పుత్తూరు, వడమాలపేట మండల రైతులకు పుత్తూరు వ్యవసాయ అధికారి కార్యాలయ ఆవరణలో ట్రాక్టర్‌కు సంబంధించిన కల్టివేటర్లు, స్ప్రేయర్లు, ఇతర పరికరాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య, పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.రమేష్, పుత్తూరు వ్యవసాయ అధికారి కోదండయ్య, వడమాలపేట వ్యవసాయ అధికారి ఏ.విజయ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు మురళి, లబ్ధిదారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సు కోసమే భూముల రీ సర్వేలు

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సర్వేలను భూముల రీ సర్వేను నిర్వహిస్తుందని రైతులు సర్వేలకు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కరించి న్యాయం జరుగుతుందని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మ భూపాలపురంలో భూముల రీ సర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో రైతులను ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రీ సర్వేలు పాల్గొని పరిష్కరించు కోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో రీ సర్వే జరిగేటప్పుడు ప్రతి రైతు భూములు వద్ద చేరుకుని సమస్యను పరిష్కరించుకోవాలని తెలియజేశారు. తిమ్మ భూపాలపురం రెవెన్యూ పరిధిలో మొత్తం 386.78 ఎకరాలు ఉందని, ఇందులో పట్టా భూములు 263.60 ఎకరాలు కాగా ప్రభుత్వ భూమి 123.8 ఎకరాలు భూములు రికార్డులు ఉన్నాయి. పలు విషయాలను పరిష్కరించేందుకు భూముల రీ సర్వే సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ మించల నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ని మర్యాదపూర్వకంగా కలసిన టీడీపీ మండల నాయకులు

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



తహసీల్దార్ శ్రీదేవిని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి పార్టీలకతీతంగా అందరికి న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మావిళ్ళపల్లి సుధాకర్‌నాయుడు, టీడీపీ పార్లమెంట్ రైతు సభ్యుడు భాస్కర్, కొండబాబు, గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధి వెలుగు సంఘాల లక్ష్యం

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



తెలుగు సంఘాల ద్వారా మహిళలు కుటుంబం అభివృద్ధి చెందడమే తెలుగు సంఘాల లక్ష్యమని ఏపీఎం మునెయ్య తెలిపారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలు సభ్యులు వారిగా ఏ నెలలో లోను వస్తుంది అది ఏ కార్యక్రమానికి ఉపయోగించాలి అనే విషయంపై వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక నమోదు చేయడం జరిగింది. ఆ ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తీసుకునే రుణాలు జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలని దానికి అనుగుణంగా ప్రతి సంఘమిత్ర, గ్రామ సమాఖ్య లీడర్లు మీ గ్రామంలో తీసుకునే రుణాలతో జీవనోపాధులు కల్పనే లక్ష్యంగా పని చేయాలని, అలాగే తీసుకున్న సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు రుణాలు డిమాండ్ ప్రకారం వంద శాతం రికవరీ చేయాలని తెలియజేశారు. అనంతరం లీగల్ కో-ఆర్డినేటర్ సింగారం మాట్లాడుతూ 2024-25 సంవత్సరంకు సంబంధించిన ఆడిట్ త్వరలోనే ఉంటుందని, కావున ప్రతి గ్రామ సమాఖ్య వారు ఆడిట్‌కి సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, అకౌంటెంట్ హిమ గిరిజ, మండల సమాఖ్య లీడర్లు శ్వేత, భారతి, లావణ్య, అన్ని గ్రామ సమాఖ్యల లీడర్లు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేడు మహిళా వర్సిటీకి ఐఎస్ఓ బృందం

తిరుపతి విద్య, ఏప్రిల్ 15 ప్రభాతవార్త




విద్యా నాణ్యతను మరింత మెరుగు పరచుకునేందుకు పద్మావతి మహిళా వర్సిటీ కసరత్తు ప్రారంభించింది.ఈ నేపథ్యంలో ఐఎస్ఓ నిపుణుల బృందం బుధవారం నుంచి రెండు రోజుల పాటు వర్సిటీలో పర్యటించనుంది.ఇందులో భాగంగా వర్సిటీలోని పలు విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలను, పలు శాఖల శాస్త్రీయ విధానాలు,అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్,పరిశోధన,సామాజిక సేవా కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించనుంది.ఈ మేరకు విశ్వవిద్యాలయంలోని అన్ని విద్యా విభాగాలు, పరిపాలనా శాఖలు అవసరమైన దస్తావేజుల తో పాటుగా అవసరమైన సమాచారాన్ని అందించేందుకు సన్నద్ధమైంది.ఈ సందర్భంగా ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి మాట్లాడుతూ నిరంతర నాణ్యతా అభివృద్ధికి ఇది ఒక కీలకమైన అడుగు పడు తోందన్నారు.ఐఎస్ఓ సర్టిఫికేషన్తో విశ్వవిద్యాలయ పరిపాలనా విధానాలు, పారదర్శకంగా మారతాయని,విజ్ఞానం, నైపుణ్య పరంగా మరింత వృద్ధి చెందుతుందన్నారు.

## ఐఎన్ టిఎస్ఓ ఒలంపియాడ్ ఫైనల్‌లో శ్రీ చైతన్య ప్రభంజనం

తిరుపతి విద్య, ఏప్రిల్ 15 ప్రభాతవార్త



స్థానిక తిరుపతి టౌన్ శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ లో 2024-25వ సంవత్సరానికి గాను ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ ఫైనల్ రిజల్ట్స్‌లో 24మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటి ప్రభంజనం సృష్టించారని విద్యా సంస్థల ఏజీఎం సురేష్ తెలిపారు. 5లాప్టాప్,19 టాబ్లెట్ లు గెలుపొందారని తెలిపారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డి ఇ ఓ కే వి ఎన్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచ్‌ల ప్రధానోపాధ్యాయులు, డీన్లు,కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో సంస్కృతి విద్యార్థుల విజయకేతనం

తిరుపతి విద్య ఏప్రిల్ 15 ప్రభాతవార్త



ఇంటర్ ఫలితాల్లో తిరుచానూరు సంస్కృతి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు ఆ సంస్థల డైరెక్టర్ ప్రణీత్ తెలిపారు. ద్వితీయ సంవస్సర ఫలితాల్లో సి.కే.జితేష్ (991 /1000) మార్కులతో రాష్ట్ర స్థాయిలో 2 వ స్థానం,తిరుపతి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు.ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవస్సర ఫలితాల్లో 50 శాతం పైగా విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించారు.ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులను,అందుకు కృషి చేసిన అధ్యాపక బృందమును,సంస్కృతి విద్య సంస్థల చైర్‌పర్సన్ పి.సులోచన, డైరెక్టర్ ప్రణీత్ అభినందించారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

పాకాల, ఏప్రిల్ 15, ప్రభాతవార్త



పాకాల మండలం పార్క్ వీధిలోని ఓ అపార్ట్మెంట్ వద్ద ఈరోజు అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పొరపాటున గ్యాస్ సిలిండర్ అంటుకుంటే వెంటనే భయపడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఆ అగ్ని ప్రమాదాన్ని మహిళలు ఎలా ఎదుర్కోవాలి అన్న సమస్యపై గ్యాస్ సిలిండర్ బహిరంగంగా మండించి ఎలా ఆర్పివేయాలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి గుణశేఖర్ రెడ్డి, ఎల్ఎఫ్ బాలాజీ, ఎఫ్ ఎమ్ నాగర్జున, సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నారాయణవనం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :



మండలంలోని కీళగరం గ్రామానికి చెందిన ఎం.వేదవతి గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. ఆమె పలు ఆసుపత్రుల్లో లక్షలాధి రూపాయాలను ఖర్చు చేసి నయం చేసుకున్నారు. సమాచారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి వెళ్లడంతో ముఖ్యమంత్రి సహాయనిధి 40వేల రూపాయాలను మంజూరు చేశారు. ఈ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, మాజీ సర్పంచ్ కెఎస్ రవిరెడ్డి, నాగరాజు, పిజి ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను వేధింపులకు గురిచేయడం తగదు...!

నారాయణవనం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :





నాయకులు తమ తీరును మార్చుకొని వుందాగా వ్యవహరించి అధికారులను వేధింపులకు గురి కాకుండా చూడాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. నాయకులు అధికారుల వద్దకు వెళ్లి తమకు పైస్థాయి నేతల అండ దండిగా వుందని బెదిరిస్తే బెదరవద్దని నిజాయితీగా పని చేయండంటూ భరోసా ఇచ్చారు. సత్యవేడు నియోజకవర్గ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం పిచ్చాటూరులోని ఏంకెటి కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏడు మండలాలకు చెందిన అధికారులందరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామాల్లో సిసి రోడ్లు, మురికికాలువలు, గోకులంషెడ్లు, నీటి తొట్టేలు నిర్మిస్తున్నట్టు గుర్తు చేశారు. ఇకపోతే స్మశాన స్థలంతో పాటు నీటి సౌకర్యం, బట్టలు మార్చుకొనే గదులు నిర్మించుకోవడం కోసం నిధులు మంజూరు చేయిస్తానన్నారు. బెదిరింపులకు అధికారులు ఎవ్వరు బెదరవద్దని, అలా ఎవరైనా బెదిరిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులందరు పాల్గొన్నారు.

## పోషకాహారమే మహిళలకు ఆరోగ్య సంజీవిని.

రేణిగుంట ఏప్రిల్ 15 ప్రభాతవార్త



పోషకాహారమే మహిళలకు ఆరోగ్య సంజీవిని అని రాస్ కోఆర్డినేటర్ భారతి అన్నారు. రేణిగుంట మండలం జి.పాలెం పంచాయితీ అంగన్వాడి కేంద్రం నందు చైల్డ్ ఫండ్ ఇండియా, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమం జరిగింది. గర్భిణీ స్త్రీలకు వెయ్యి రోజుల పోషణ ట్రాకింగ్, జన ఆందోళన, పోషకాహార ప్రాముఖ్యత, సమతుల్య ఆహారం, తదితర అంశాలపై వివరించారు. బాలింతలు, కిశోర బాలికలు ఎలాంటి పద్ధతులు అవలంబించాలో తెలియజేశారు. అంగన్వాడి కేంద్రంలో అందించే పోషకాహారాల గొప్పతనాన్ని విసిదీకరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమావతి, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధా, తిరుపతి రాస్కో ఆర్డినేటర్ భారతి, మహిళా పోలీస్ కవిత, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## సత్యవేడు రెగ్యులర్ తహసీల్దార్‌గా రాజశేఖర్...?

సత్యవేడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

సత్యవేడు రెగ్యులర్ తహసీల్దార్‌గా రాజశేఖర్ నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వరదయ్యపాళెం తహసీల్దార్‌గా పని చేస్తున్న రాజశేఖర్ సత్యవేడుకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. గతంలో సత్యవేడుకు రెగ్యులర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న టి.వి.సుబ్రహ్మణ్యంను ఫిబ్రవరిలో డిప్యూటేషన్‌పై జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తున్న రాజశేఖర్‌కి ఉన్నతాధికారుల అండదండలు, శ్రీసిటీ యాజమాన్యం మద్దతు ఉన్న నేపథ్యంలో సత్యవేడుకు రెగ్యులర్ ప్రాతిపదికన కొనసాగించడానికి ప్రయత్నాలు కొనసాగుతోంది. త్వరలోనే సత్యవేడు రెగ్యులర్ తహసీల్దార్‌గా రాజశేఖర్ నియమితులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అగ్నిమాపక వారోత్సవాలు

సత్యవేడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:



వంటనూనె మంటలను ఆర్పడానికి తడి రసాయన అగ్నిమాపక యంత్రాన్ని ఉపయోగించాలని సత్యవేడు అగ్నిమాపక కేంద్ర ప్రధాన అధికారి రాజయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోనే శ్రీకాళహస్తి బస్టాప్, రిలయన్స్ మార్ట్ ప్రాంతాల వద్ద ఆయిల్ ఫైర్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక ప్రధాన అధికారి రాజయ్య మాట్లాడుతూ నూనె, గ్రీజు వంటి మండే ద్రవాలు మంటలు పట్టడం ఆయిల్‌ఫైర్స్‌గా పేర్కొనవచ్చునన్నారు. చిన్న గ్రీజు మంట సంభవించినప్పుడు దానిని ఆర్పడానికి పాన్‌ను ఫైర్ బ్లాంకెట్‌తో కప్పాలన్నారు. అయితే ఆయిల్ ఫైర్స్ ప్రభావం వల్ల దద్దుర్లు, అలసట వంటి ఆరోగ్య ప్రభావాలు ఉండొచ్చని వివరించారు.తదనంతరం ఆయిల్ ఫైర్స్ నివారణపై అగ్నిమాపక సిబ్బంది తడి రసాయన ప్రయోగాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.అగ్నిమాపక సిబ్బంది ప్రసాద్, శ్రీనివాసులు, గోవిందరాజులు, సుబ్రహ్మణ్యం, నరేష్, రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రాయితీ ద్వారా వ్యవసాయ పనిముట్లు పంపిణీ



గూడూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మంగళవారం గూడూరు నియోజకవర్గంలోని గూడూరు రూరల్, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల 103 మంది రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయడం జరిగింది. గూడూరు పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ ముందుగా స్టాల్స్‌ను పరిశీలించారు. రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో వ్యవసాయశాఖను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రైతులకు ఏమి చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తక్కువ సమయంలోనే గూడూరు నియోజకవర్గంలో 103 మంది రైతులకు పరికరాలు వ్యవసాయ పనిముట్లు రాయితీతో అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో ఇంకా ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచిం చారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మేన, డిపిఎం రవిచంద్ర ప్రసాద్, ఏడి గోపి నాయక్ మట్టంశ్రావణి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, గణపతి, కిషోర్ నాయుడు, వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్ రహీం, భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి మధుసూదన్‌రెడ్డి షేక్ జలీల్ అహ్మదు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలు నాయకులకు అండగా ఉంటా: ఎంపీ



వెంకటగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: పార్టీ కార్యకర్తలు నాయకులకు తన వంతు అండగా ఉంటానని ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి తెలిపారు. వెంకటగిరిలోనే వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి హరికృష్ణ కార్యాలయం వద్ద ఎంపీ పార్టీ నాయకులు కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలు నాయకులకు సహకారాలు అందిస్తానని తెలిపారు.

## రిటైర్మెంట్ వయసు పెంచాలి : సిఐటియు




వెంకటగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ ధర్నాని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంపుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రసాద్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఉపాధి హామీ పథకం అంతా అవినీతిమయం

### - సామాజిక తనిఖీల్లో వెలుగుచూసిన నిజం
### - అందరిపైన చర్యలు - డ్వామా పీడీ



కోట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 545 పనులకు గాను 11 కోట్ల 99 లక్షల 913 రూపాయలకు ఉపాధి హామీ పథకంలో చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీల ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ పలు పంచాయతీల్లో అవకతవకలు జరిగాయని, డీఆర్‌పీఏలు సర్వే చేసి నివేదికలు వెల్లడించాయని చెప్పారు. అందులో ఎక్కువ భాగం పనులు చేసిన దగ్గర నేమ్ బోర్డులు పెట్టలేదని, ఉపాధి హామీ కింద నాటిన మొక్కలు ఎక్కడా కనిపించలేదని, ప్రింటింగ్ రికార్డులు నిర్వహించలేదని, కూలీల వేతనానికి సంబంధించి మస్టర్లలో పేర్లు లేవని పలు ఆరోపణలతో నివేదికలు అందాయని చెప్పారు. ఉపాధి కార్యాలయంలో పనులు పారదర్శకంగా చూపలేదని, నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, దీనికి బాధ్యులైన అందరిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పలు సార్లు ఉపాధి హామీ ఉద్యోగులపై మండిపడ్డారు. ఏపీడీఓపై కూడా బదిలీ వేటు తప్పదన్నారు. సుమారు 4 లక్షల మేరకు అవినీతి జరిగిందని సర్వేలు తేల్చాయన్నారు. ఏపీఓ, క్షేత్రస్థాయి సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ల వద్ద రికవరీ చేస్తామని, అవసరమైతే జీతాల నుంచి కూడా రికవరీ చేస్తామని తెలిపారు. ఈ సదస్సులో ఏపీడీఓ వరప్రసాద్, ఏఈలు దినేష్‌కుమార్, ఎపిఓ పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

## కోటలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



కోట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: కోటలో మంగళవారం శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండు పింక్ బస్సులు ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతంగా జరుగుతున్నాయని డాక్టర్ నాగరాజు తెలిపారు. బిపి, షుగర్ పరీక్షలతో పాటు పింక్ బస్సులలో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మమ్మోగ్రామ్ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్యభాను, హరిత, శ్రీరామకృష్ణస్వాతి, నాగూర్‌రెడ్డి, ఎఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## సర్వే నంబర్లు మార్చి భూములు రిజిస్టర్ చేస్తున్నారు



వెంకటగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నందు గవర్నమెంట్ స్థలలను వెంకటగిరి టౌన్ సర్వే నెంబర్ 279ను ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని వైసీపీ ఆర్టిఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరిశంకరయ్య తెలిపారు. గవర్నమెంట్ అసైన్మెంట్ స్థలం సర్వే నెంబర్ 3071,2,3,4, 3074లో 9ఎకరాల 0.33సెంట్లు గవర్నమెంట్ భూమి. వెంకటగిరి నందు గల ప్రైవేట్ లేఅవుట్ లలో అసైన్మెంట్ స్థలలను పక్కనే ఉన్న సెటిల్మెంట్ స్థలల సర్వే నెంబర్ ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. అమ్మవారిపేట సర్వే నెంబర్ 216 సెటిల్మెంట్, అదే అమ్మవారిపేటలో సర్వే నెంబర్ 2162 అసైన్మెంట్, సర్వే నెంబర్ 216ను ఉపయోగించి సర్వే నెంబర్ 2162 అసైన్మెంట్ స్థలలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇటువంటి రిజిస్ట్రేషన్లు వెంకటగిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో జరుగుతున్నవని, దళారులతోనే రిజిస్ట్రేషన్లు జరుగుతు న్నాయన్నారు. ఇలా చేస్తేనే గవర్నమెంట్ స్థలలను కాపాడుకోవచ్చని తెలిపారు.

## ఉపాధి హామీ పనిదినాలు పెంపుపై అభినందనీయం




గూడూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకంలో పని దినాలు వంద రోజుల నుంచి 150 రోజులు పెంచాలని, అదే విధంగా కూలీ 300 నుండి 400 రూపాయలు పెంచుతూ పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేయడం అభినం దనీయం అని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 చట్టం వచ్చిన దగ్గర నుంచి సుదీర్ఘకాలం పాటు ప్రధానమైన మార్పులు చేయలేదన్నారు. ఈ చట్టం అమలు తీరుపై పార్లమెంటరీ కమిటీ వేశారని, దాని సిఫార్సుల మేరకు వివిధ రాష్ట్రాలలో వేతనాలలో ఉన్న వ్యత్యాసాలను గమనించి కనీస వేతనం రూ.400 ఉండాలని, ప్రతి కుటుంబానికి కనీసం 150 రోజులు పని దినాలు ఉండాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేయడం హర్షణీయం అని తెలిపారు. ఈ చట్టంలో ఇచ్చిన దాని ప్రకారం నిరుద్యోగ భృతి, వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదని, పరిహారం అమలు చేయడం లేదని, మెటీరియల్ కాంపోనెంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం హెచ్చించాలని పార్లమెంటరీ కమిటీ అనేక సిఫార్సులను వ్యవసాయ కార్మికుల కోసం చేసిందని పేర్కొన్నారు. కూలీల కోసం చేసిన ఈ ప్రతిపాదనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఉపాధి హామీ పనికి సంవత్సరానికి నాలుగు లక్షల రూపాయలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గూడూరు నియోజక వర్గ కార్యదర్శి శ్రీనివాసా మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అభినందనలు



కోట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు కడప కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ట్రోఫీ క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారని ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం క్రీడా కారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు. బాస్కెట్ బాల్‌లో బిందు, మాధవరాజు, సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట శివసాయి శ్రీకర్‌రెడ్డి, ఎం.బాలయ్య, సూర్యప్రకాష్, నాగనిశాంత్, ఆదిత్యశర్మ, సుకేశ్‌రెడ్డి, వెంకట అవినాష్, హర్షవర్ధన్, కబడ్డీ పోటీల్లో వై.చైతన్య, రేవంత్, హేమ సుదర్శనరెడ్డి, కల్యాణ్, మణికంఠ, వెంకటరాహుల్‌రెడ్డి, మునిబాబు, విష్ణువర్ధన్, రంగా రోహిత్‌రెడ్డి, బాలాజీ, పవన్‌కుమార్, సుమంత్, బాల్‌బ్యాడ్మింటన్‌లో మనోహర్‌రెడ్డి, మహిధర్, తేజస్ రాజా, శ్రీనాథ్, హేమంత్‌కుమార్‌రెడ్డి, వైభవ్, నవదీప్, కృష్ణమూర్తిలు విజేతలుగా నిలిచారు.

## మండలానికి 24 తొట్టెల మంజూరు : ఎంపీడీవో



బాలాయపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మండలానికి పశువుల తాగు నీటి కోసం 24 తొట్టెలు మంజూరైనట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. మండలం లోని మన్నూరు మిట్ట గ్రామంలో నిర్మితమవుతున్న పశువుల తొట్టెను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 తొట్టెల పనులు పూర్తి చేయని ఇక 10 పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఒక చోటికి 33 వేల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. మల్లూరుమెట్టలో తాగునీటి సమస్య ఉన్నట్లు స్థానిక నేత కోటేశ్వరరావు గౌడ్ ఎంపీడీవో దృష్టికి తీసుకొని వెళ్లారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## రైల్వే స్టేషన్లో ప్రయాణీకులకు మజ్జిగ పంపిణీ



గూడూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : పట్టణంలోని రైల్వే జంక్షన్లో మంగళవారం డాక్టర్ ఏపీజే. అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రయాణీకులకు వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ తాజుద్దీన్ గత పదేళ్లుగా మిసైల్ మెన్, భారత రత్న డాక్టర్ ఏపీజే. అబ్దుల్ కలాం పేరుతో ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్యార్థులు, నిరుపేదలకు సేవలందిస్తున్నారని తెలిపారు. డాక్టర్ తాజుద్దీన్ సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రైల్వే ఆర్పీఎఫ్ సీఐ హెచ్.ఎల్. గుర్జార్, చీఫ్ కమర్షియల్ సూపర్ వైజర్ ఆరేటి వెంకటే శ్వర్లు మాట్లాడుతూ రైల్వే స్టేషన్లో వివిధ రైళ్లలో వెళుతున్న ప్రయాణీకులకు మంచినీటి బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్, ట్రస్ట్ సభ్యులు దగ్గోలు సురేంద్రబాబు, ఉప్పల పెంచలగౌడ్, గండవరం వసుంధర, సోమిశెట్టి లక్ష్మీ నరసింహ స్వామి, ఎల్లుజు రవికుమార్, వై.శ్రీనివాసులు, ఎస్కే.షాహెరా, షేక్ ఆరీఫ్, సయ్యద్ నియామతుల్లా, బర్కతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగివుండాలి



నాయుడుపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగివుండాలని నాయుడుపేట అగ్నిమాపక అధికారి రమణయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలీండర్ లీకై అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రర్తలను డెమో ద్వార చేసి వివరించారు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వార అగ్నిప్రమాదాలను నివారించ వచ్చున్నారు. ముఖ్యంగా మహిళలు అగ్ని ప్రమాదాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగివుండాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర లీడింగ్ ఫైర్‌మాస్ అమరావతి చంద్రబాబు సందీప్, నాగరాజు, పోలయ్య, బాలజీ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



కోట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కోట అగ్నిమాపక శాఖ అధికారి హరీష్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రయాణి కులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇంట్లో అనుకోకుండా వంట గ్యాస్ లీకైన సందర్భంలో మంటలను ఎలా అదుపు చేయాలనే విషయంపై అవగాహన కల్పించారు. మంటలు ఏర్పడి నప్పుడు 101కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ప్రయాణి కులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిక్, నాగరాజు, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రకాశానందగిరిస్వామి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి లోని శుకబ్రహ్మాశ్రమంలో జరుగుతున్న వార్షికోత్స వాల్లో భాగంగా మంగళవారం ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందగిరి స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా భారీ ఎత్తున పాదుకా పూజల కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ వ్యవస్థాపకులు సమాజంలో ఆధ్యాత్మిక చింతనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గీతా మకరందం ద్వారా సమాజంలోని రుగ్మతలను రూపుమాపుటకు ప్రయత్నించారన్నారు. అన్ని భాషల్లో గీతా మకరందాన్ని ముద్రించి గీతలోని మర్మాన్ని సమాజానికి వివరించారన్నారు. స్వామి జన్మదిన సందర్భంగా పాదుకలకు పూజలు నిర్వహించారు. ధ్యాన మందిరంలో స్వామి పాలరాతి విగ్రహానికి అలాగే పాదుకా పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు సాధువుల సారధ్యంలో పాదుకా పూజలు నిర్వహించారు. స్వామి 112వ జన్మదిన సందర్భంగా విశేష అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, స్వస్వరూపానందగిరి స్వామి విష్ణుసేవానందగిరి స్వామి, హరితీర్థా స్వామి, సర్వాత్మానందగిరి యోగిని చంద్రకాళిమాతప్రసాదస్వామిజి, శ్రేయానంద సరస్వతి పాల్గొన్నారు.

## బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ

### - మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ ట్యాక్స్‌కు సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులకు ప్రభుత్వం ఆదేశాల ప్రకారం వడ్డీపై 50 శాతం రాయితీ కల్పించినట్లు కమిషనర్ కె.చిన్నయ్య మంగళవారం తెలిపారు. గతంలో వడ్డీ రాయితీ ప్రకటించినప్పటికీ ప్రస్తుతం ఈనెల 30వ తేదీ వరకు 50శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం మంచి సదవకాశం కల్పించిందని అన్నారు. అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను, ఆస్తి పన్నులను ఏడాది కాలానికి చెల్లించిన వారికి 5 శాతం రిబేట్ కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. పన్నులు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్లు సెలవు దినాల్లోను ఈ నెల 30వ తేదీ వరకు పనిచేస్తాయని చిన్నయ్య తెలిపారు.

## మహిళ మెడలో చైన్ అపహరణ!

నాయుడుపేట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : పట్టణంలోని లోతువానిగుంటలో నివాసం ఉంటున్న సిరివెల్ల తులసి మెడలో మూడుసవర్ల బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండగులు బైక్‌పైవచ్చి అపహరించుకు వెళ్లినట్లు బాధితురాలు నాయుడుపేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తులసి షాపునుండి ఇంటికి వస్తున్న సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి బలవంతంగా చైన్‌ను లాకొని వెళ్ళినట్లు ఆమె తెలిపారు. నాయుడుపేటలో మహిళలు ఒంటరిగా బంగారు వేసుకొని ఇంటినుండి బయటకు రావాలంటే హడలిపోతున్నారు. నాయుడుపేట పట్టణంలో పోలీసుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో ఏదొఒక ప్రాంతంలో చోరీలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన పోలీసులు స్పందించి నాయుడుపేటలో చోరీలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## దళిత గిరిజనులకు కరెంటు ఇవ్వాలి : సిపిఎం

వెంకటగిరి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : సీతారాం ఏచూరి నగర్‌లో ఉన్న దళిత గిరిజనులకు వెంటనే కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని సిపిఎం పట్టణ కన్వీనర్ వడ్డిపల్లి చంగయ్య తెలిపారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద ఏచూరి నగర్‌లో నివాసం ఉంటున్న దళిత గిరిజనులకు కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్లూలు పంచాయతీ పరిధి సీతారం ఏచూరి నగర్ నందు గత రెండు సంవత్సరముల నుండి దళిత గిరిజనులు పేదలు నివాసాలు ఉంటున్నారన్నారు. పేదల్ని అక్కడి నుండి తరిమేసి ఆ భూమిని కబ్జా చేయాలని కొందరు ప్రయత్నం చేస్తున్నారన్నారు. దళిత గిరిజనులు కలెక్టర్ గారిని కలిసినప్పుడు యధాతధంగా నివాసాలు ఉండమని చెప్పారని అన్నారు. కార్మిక సంఘం నాయకులు కే రాజయ్య, దొరబాబు, వెంకటయ్య, నాగమణి, నాగరాజు, పెంచలయ్య, ధనలక్ష్మి, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులు మురగయ్య నవీన్ ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఎం వి రమణ, తదితరులు పాల్గొనడం జరిగింది.

## లింగారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



వాకాడు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: మండల కల్లూరు పంచాయతీ పరిధిలోని కోడివాక గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు లింగారెడ్డి మస్తాన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది, తన స్వగ్రామమైన కోడివాకకు రావడంతో సమాచారం తెలుసుకున్న గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ మంగళవారం మస్తాన్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, దోసకాయల కృష్ణమూర్తి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ అవకాశమే మెగా జాబ్‌మేళా లక్ష్యం : కలెక్టర్




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: జిల్లాలోని ప్రతి నిరుద్యోగికి ఉపాధి అవకాశం కల్పించటవే మెగా జాబ్‌మేళా లక్ష్యం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా ఉందని ఇక్కడ ఏ ఒక్కరు చదువుకున్న వారు ఖాళీగా ఉండకూడదని ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ సుఖమంతమైన జీవనం గడుపుటకు ప్రయత్నిస్తు న్నామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ మంత్రి స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఎస్ ఎస్ కళ్యాణమండపంలో భారీ ఎత్తున జాబ్‌మేళా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ మంత్రిగా గోపాలకృష్ణారెడ్డి నియోజక వర్గ అభివృద్ధితో పాటు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు వివరించారు. నేడు ఆయన జన్మదినం సందర్భంగా ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ఆయన అడుగు జాడల్లో నడవటం అభినంద నీయం అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతిజిల్లాలో నిరుద్యోగుల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సాంకేతిక శాఖ మంత్రి నారాలోకేష్ ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా రన్నారు. జిల్లాలో రతన్‌టాటా ఇన్నోవేషన్‌సెంటర్‌ను అడ్వాన్స్ స్కోప్ మాడల్ ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నారని కలెక్టర్ వివరించారు. తిరుపతి .జిల్లా సౌత్ కోస్ట్, రాయలసీమ జిల్లాలో స్పోక్ సెంటర్‌గా ఉటుందన్నారు. దీనిని ఐఐటి తిరుపతి సహకారంతో జిల్లా యంత్రాంగం మరియు ఆదాని, నవయుగ ప్లస్, అమర్‌రాజా పరిశ్రమల వారిని పార్ట్‌నర్స్‌గా చేసుకుంటూ టాటావారి సౌజన్యంతో సెంటర్‌ని కూడా మనం ప్రారంభించుకోబోతున్నామన్నారు. నేటి జాబ్‌మేళాకు సుమారు 2వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఇందులో 719 మంది ఎన్నికయ్యారని 325మంది షార్ట్‌లిస్టు అయ్యారని వివరించారు. అందరికి ప్లేస్‌మెంట్ ఆర్డర్స్ జారి చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వరన్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పి హర్షవర్ధన్ యాదవ్ కార్పొరేషన్ ఛైర్మెన్ నరసింహాయాదవ్, ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, ఎస్పి హర్షవర్ధన్ రాజు ఎంపిడిఓలు రవీంద్రనాథ్, రఫీఖాన్ వెంకటరమణ, ఆర్‌లోకనాథం, హాజరయ్యారు.

## వెట్టిచాకిరి నుండి కూలీల విముక్తికి చర్యలు : కలెక్టర్



చిత్తూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: జిల్లాలో నిర్బంధ వెట్టిచాకిరికి బలవుతున్న కూలీలకు విముక్తి కలిగించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం నిర్బంధ వెట్టిచాకిరి కూలీ విధానం నిర్మూలనపై కలెక్టర్ సుమిత్ కుమార్ జాయింట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి సంబంధిత అధికారులు, రోప్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్బంధ వెట్టిచాకిరి విధానం ఫౌల్ట్రీ, పరిశ్రమలు, ఇటుకల తయారీ ప్రాంతాల్లో చాలా వరకు అమలు అవుతున్నదని, దీని కారణంగా ఆర్థిక, శ్రమ దోపిడితో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇలాంటి వారిని గుర్తించడానికి ఆర్డీఓలు డివిజన్ స్థాయిలో తహసిల్దార్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, కార్మిక శాఖ డిప్యుటీ కమీషనర్ ఓంకార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, నెహ్రు యువజన కేంద్రం కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, డిటిడబ్ల్యుఓ మూర్తి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి, రోప్స్ సంస్థ ఛైర్మన్ ధనశేఖర్, ప్రోగ్రామ్ హెడ్ శాంజెబాదురై, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతరో...జాతర...గంగమ్మ జాతర...!

### -చౌడేపల్లి జాతరకు 75యేళ్ళు -అమ్మవారి వివాహానికి తరలిన భక్తజనం



చౌడేపల్లి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : యేటా ప్రతిష్టాత్మకంగా జరిగే నడివీధి గంగమ్మ జాతర మంగళవారం కోలాహలంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరుగు జాతరలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. తొలిరోజున నిర్వాహకుల్లో ఒకరైన కడియాల మహేష్‌బాబు గంపతీసుకొని గ్రామదేవతలకు పూజలు చేసారు. అనంతరం పెద్దలు, బ్రాహ్మణ మహిళలతో పిడిదీపాలతో చౌడేశ్వరీదేవి ఆలయంలోకి వెళ్ళి అక్కడ అమ్మవారికి చెల్లించారు. దీంతో జాతర మొదలైంది. కుమ్మరివీధిలోని కళ్యాణ గంగమ్మ వద్ద గంగమ్మను నెలకొల్పి విశేష పూజలు చేసారు. అక్కడి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల మద్య నడివీధి గంగమ్మను ఊరేగించారు. అనంతరం స్థానిక చాకలివీధిలోకి అమ్మవారిని తీసుకొచ్చారు. ఇక్కడ రాష్ట్రంలో లేని విధంగా గంగమ్మకు వివాహం చేయడం గమనార్హం. వివాహనంతరం అమ్మవారిని నడివీధిలో భక్తుల దర్శనార్థం ఉంచారు. బెస్తవారి ఇంటి నుంచి ఘట్టముకుండ వెళ్ళిన తర్వాత అమ్మవారి సర్వదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉదయాన్నే పట్టణ మహిళలు నాలుగు దిక్కుల్లోని గ్రామదేవతలకు పిండి దీపాలతో ఆరాధించారు.


**SRIKALAHASTI MUNICIPALITY**

The Commissioner, Srikalahasti Invites Tender on e-procurement platform from the "eligible contractors" for the following works

| IFB Nos | Name of the works | No of works | Estimate amount in Rs. in Lakhs |
|---|---|---|---|
| IFB No: 32, 33,38, 40 to 46/ 2024-25 & 1 to 5/20 25-26 date : 15-04-2025 | Pipe Line, Bore well, Drain, Building Reparis, Painting, Shed, Tiles | 15 works | 63.18 lakhs |
| Total | | **15 works** | **63.18lakhs** |

For particulars please contact Deputy Executive Engineer during office working hours (or) see e-procurement market place: https:// tender.apeprocurement.gov.in

**Commissioner, Srikalahasti Municipality**

**పురపాలక సంఘ కార్యాలయము,గూడూరు**

ఆర్.ఓ.సి.నెం.540/2025/ఇ1 తేది : 16.04.2025

**ఆసక్తి వ్యక్తీకరణ నోటీసు**

గూడూరు పురపాలక సంఘమునకు సంబంధించి "Providing quality reports on the quality of various development works to be executed under various grants for the Financial Years 2025-26 and 2026-27 (i.e.,upto 31.03.2027) by conducting quality tests/ inspections in Guduru Municipality"అను పనికి ఆసక్తి వ్యక్తీకరణ తెలుపవలసినదిగా నిష్ణాతులైన కన్సల్టెన్సీ ఏజెన్సీ వారిని కోరడమైనది. సదరు ప్రతిపాదనలు **24.04.2025** తారీఖున సాయంత్రం **4.00** గంటల లోపు సీల్డ్ కొటేషన్లు ద్వారా అందజేయవలెను. ఇంకనూ ఏవైనా సాంకేతిక అంశము కొరకు పురపాలక సంఘ కార్యాలయములో ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

**కమిషనరు, గూడూరు పురపాలక సంఘం**